ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
7
శనివారం 8 జూన్ 2024

రూ.932 కోట్లు



జిల్లాలో రైతులకు రెండు నెలలుగా చెల్లించాల్సిన ధాన్యం బకాయి సొమ్ములు

వైసీపీ ప్రభుత్వం రైతులను నడిరోడ్డున పడేసింది. ధాన్యం సొమ్ములు చెల్లించకుండా రైతు పరపతిని దెబ్బతీసింది. ఎన్నికల ముందు కొద్దిపాటి సొమ్ములు చెల్లించి, రైతుల్లో ఆశలు రేకెత్తించింది. ప్రభుత్వానికి ధాన్యం విక్రయిస్తే సొమ్ములు వేగవంతంగా వస్తాయని చూపింది. ఎన్నికలు ముగిసిన తరువాత ముఖం చాటేసింది. కోట్లాది రూపాయలు పెండింగ్‌లో ఉండిపోవడంతో రైతులు అల్లాడిపోతున్నారు. రబీ సాగు కోసం చేసిన బకాయిలను తీర్చలేకపోతున్నారు.



మండలం	బకాయి సొమ్ము (రూ.కోట్లలో)	మండలం	బకాయి సొమ్ము (రూ.కోట్లలో)
1.ఆకివీడు	22.30	11.పెనుగొండ	50.23
2.భీమవరం	37.62	12.పెనుమంట్ర	65.89
3.గణపవరం	43.28	13.పోడూరు	65.26
4.పాలకోడేరు	47.41	14.యలమంచిలి	28.67
5.ఉండి	42.64	15.అత్తిలి	80.44
6.వీరవాసరం	59.89	16.పెంటపాడు	73.57
7.ఆచంట	48.20	17.తాడేపల్లిగూడెం	46.70
8.మొగల్తూరు	5.05	18.ఇరగవరం	65.43
9.నరసాపురం	46.40	19.తణుకు	37.27
10.పాలకొల్లు	47.19	20.కాళ్ల	19.50

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 7: జగన్ సర్కారు తమను మొదటి నుంచి మోసం చేస్తూనే ఉందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. జిల్లాలో రూ.932 కోట్లు ప్రభుత్వం రైతులకు చెల్లించాలి. దాదాపు 70 వేల మంది రైతులు బకాయిల కోసం ఎదురుచూస్తున్నారు. ధాన్యం అమ్మకాలు జరిగి 45 రోజులు దాటింది. టీడీపీ హయాంలో 48 గంటల వ్యవధిలోనే సొమ్ములు చెల్లించేవారు. ఆ నిబంధనను, వైసీపీ ప్రభుత్వం తమకు అనుకూలంగా మలచుకుంది. ధాన్యం విక్రయించిన తరువాత 21 రోజుల్లో సొమ్ములు చెల్లించేలా విధి విధానాలు ఖరారు చేసింది. అయినా సరే గడువులోగా సొమ్ములివ్వకుండా రైతులను ఇబ్బందులు పెట్టింది.

వెంటాడుతున్న వ్యాపారులు

రబీ సాగు కోసం పెట్టుబడి సొమ్ములు ఇచ్చిన వ్యాపారులంతా ఇప్పుడు రైతులను వెంటాడుతున్నారు. అప్పు తీర్చమని కాళ్లరిగేలా తిరుగుతున్నారు. చక్రవడ్డీలు వేస్తున్నారు. రైతులు తమకు ఇవ్వాల్సిన బకాయిలను వడ్డీతో కలిపి పెంచేస్తున్నారు. ఎరువులు పురుగు మందులు, వరి నాట్లు మాసూళ్లకు వ్యాపారుల వద్దే అప్పు తీసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కౌలు రైతులంతా అప్పుపైనే ఆధారపడుతున్నారు. పంట చేతికి వచ్చిన తరువాత అమ్మకాలు నిర్వహించి అప్పులు తీరుస్తున్నారు. ఈసారి వ్యాపారులకు రుణం తీర్చలేక రైతులు ముఖం చాటేసే దుస్థితి నెలకొంది. ప్రభుత్వం చేసిన తప్పి దానికి రైతులు బలైపోయారు. వ్యాపారులకు బకాయిలు తీర్చలేకపోతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

ఖరీఫ్ సాగెలా..

ఖరీఫ్ సాగు తరుముకొస్తోంది. జిల్లాలో తొలకరి వానలు మొదలయ్యాయి. మెట్టలో నారుమడులు సిద్ధం చేస్తున్నారు. డెల్టాలోనూ ఖరీఫ్ కోసం రైతులు సంసిద్ధమవుతున్నారు. సాగు చేయాలంటే పెట్టుబడి అవసరం. రబీ బకాయిలు చెల్లించలేదు. అప్పులు తీర్చలేదు. దీంతో కొత్త అప్పు పుట్టుకు రాలేదు. విత్తనాల కొనుగోలుకు చేతిలో చిల్లి గవ్వలేదు. ఎన్నికల తరువాత ప్రభుత్వం ఇంతగా మోసం చేస్తుందని వారు ఊహించలేదు. బ్యాంకుల రుణాలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. రైతు చేతికి సొమ్ములు అందకపోవడంతో మార్కెట్ స్తంభించింది. ఖర్చులు అధికంగా ఉన్నాయి. ఒక వైపు వ్యవసాయం, మరోవైపు పిల్లల చదువులు ఒకేసారి తరుముకు వస్తున్నాయి. వీటని తట్టుకోవాలంటే పెట్టుబడి కావాలి. రైతులకు సొమ్ములు వస్తేనే వ్యాపారాలు సవ్యంగా సాగుతాయి. ఇవేమి ప్రభుత్వానికి పట్టలేదు.

ధాన్యం సొమ్ము దారి మళ్లింపు

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన ధాన్యం సొమ్ములను దారి మళ్లించింది. సంక్షేమ పథకాలతోపాటు కాంట్రాక్టర్ల బిల్లులు ఇవ్వడానికి మొగ్గు చూపింది. జనవరిలో బటన్ నొక్కిన సంక్షేమ పథకాలకు మే నెలలో సొమ్ములు అందించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారు. ఇందుకోసం రైతులకు ఇవ్వాల్సిన సొమ్ములు కాంట్రాక్టర్లకు ఇచ్చి కమీషన్‌లు దండుకున్నారు. రైతులకు మాత్రం మొండి చేయి చూపించారు.

అత్తిలి రైతులకు అధిక బకాయి

జిల్లాలో సుమారు 70 వేల మంది రైతులకు రూ.932 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. ముఖ్యంగా కాలువ కింద సాగు చేసే రైతులకు అత్యధికంగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. అత్యధికంగా అత్తిలి మండలానికి చెందిన రైతులకు బకాయిలు ఎక్కువగా ఉన్నాయి. ఈ మండలానికి చెందిన రైతులకు రూ.80 కోట్ల వరకు బకాయిలు ఉండగా అత్యల్పంగా మొగల్తూరు మండలానికి రూ.5 కోట్లు రావాల్సి ఉంది. కొత్తగా కొలువుతీరిన ప్రభుత్వమైనా రైతుల ఇబ్బందులను గుర్తించి వెంటనే బకాయి సొమ్ములు విడుదల చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

వడ్డీలు కట్టలేకపోతున్నాం



పంట సొమ్ముపై ఆధారపడి లక్షల రూపాయలు అప్పులు చేశాం. తీరా పంట చేతికి వచ్చిందనుకుంటే ఇప్పుడు ప్రభుత్వం సొమ్ములు ఇవ్వకపోవడంతో వడ్డీలు కట్టలేకపోతున్నాం. నాకు రూ.10 లక్షల వరకూ రావాలి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు డబ్బులు ఖాతాల్లో వేయాలి.

- పరిమి వీరభద్రరావు, రైతు జగన్నాథపురం

కొత్త పంటకు ఇబ్బందులు



ఎనిమిదెకరాలు సాగుచేశాం. మా ఆశలన్నీ రబీపైనే. ఇప్పుడేమో డబ్బులు పడకపోవడంతో మేం అప్పుతెచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరుగుతోంది. కొత్త పంట వేసేందుకు ముందుకు కదలలేని పరిస్థితి. ప్రభుత్వం వెంటనే సొమ్ములు వేయించాలి.

వెలిగట్ల మోహనరావు, రైతు జగన్నాథపురం

సార్.. నేనూ మీ వాడినే

కూటమి నేతల వద్దకు అధికారుల క్యూ



- ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నం
- అప్పుడు వైసీపీకి అనుకూలంగా వంత పాడిన అధికారులు
- ప్రతిపక్ష నాయకులపై చిన్నచూపు
- స్థానిక ప్రజా ప్రతినిధులపైనా చర్యలు
- నేడు గెలిచిన కూటమి ఎమ్మెల్యేలతో సంప్రదింపులు

రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఉద్యోగ వర్గాలు ఊహించిన ఫలితాలే వచ్చాయి. విజయం ఏకపక్షమైంది. కూటమి క్లీన్ స్వీప్ చేసింది. అంచనాలను తలదన్నే రీతిలో కూటమి అభ్యర్థులు విజయాలు సాధించారు. అప్పటి వరకు వైసీపీ ప్రజా ప్రతినిధులతో అంటకాగిన కొందరు అధికారులు ఇప్పుడు కూటమి నేతల వద్దకు క్యూ కడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫలితాలను తారుమారు చేసిన అధికారులు కూటమి నేతల ప్రసన్నం కోసం యత్నిస్తున్నారు. 'సార్.. నేనూ మీ వాడినే' అంటూ కోడ్ ఉండగానే గెలిచిన కూటమి ఎమ్మెల్యేలను మర్యాద పూర్వకంగా కలిశారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సాధారణంగా ప్రభుత్వానికి అనుకూలంగానే అధికారులు పనిచేస్తుంటారు. అధికార పార్టీ నేతల సిఫారసులకే పెద్దపీట వేస్తారు. పనులు పూర్తి చేస్తారు. వైసీపీ ప్రభుత్వంలో కొందరు అధికారుల తీరు ఏకపక్షంగా మారింది. టీడీపీ, జనసేన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను, ప్రతిపక్ష నాయకులను రాచి రంపాన పెట్టారు. చిన్నపాటి తప్పిదానికి పెద్ద శిక్షలే వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలను తారుమారు చేసే ప్రయోగాలు చేశారు. వారంతా ఇప్పుడు కూటమి తరపున నెగ్గిన ఎమ్మెల్యేలను కలుసుకుంటున్నారు. ఇదే ఇప్పుడు ఉద్యోగవర్గాల్లో చర్చగా మారింది. ఏ ప్రభుత్వం వచ్చినా కొందరు అధికారులు మాత్రం జిల్లాలో ప్రాధాన్యం పొందుతున్నారంటూ ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది. ఈసారి అదే జరిగితే వైసీపీకి అనుకూలంగా ఉండే అవకాశం ఉందంటూ కూటమి నాయకులు అంచనాలు వేసుకుంటున్నారు. వైసీపీ హయాంలో తెలుగుదేశం, జనసేన నాయకులను ఇబ్బందులు పెట్టిన అధికారులను మాత్రం ఈ సారి జిల్లాలో పక్కన పెట్టాలని చూస్తున్నారు. అటువంటి అధికారులను ప్రోత్సహించకూడదంటూ కూటమి నాయకుల మధ్య అంగీకారం కుదిరింది.

ఆ మున్సిపల్ అధికారి మళ్లీ వస్తారా ?

జిల్లాలో ఓ మున్సిపల్ అధికారి వైసీపీ నేతలతో అంటకాగారు. పెద్ద ఎత్తున అవినీతి చేసేలా సహకారమందించారు. మున్సిపాలిటీలో నిధులను అడ్డంగా దోచుకున్నారు. వైసీపీ నాయకులకు, కార్యకర్తలనే పెద్దగా పట్టించుకోలేదు. నియోజకవర్గ నేతకు మాత్రమే అన్ని విధాలా సహకరించారు. దీనిపై టీడీపీ ఫిర్యాదులు చేయడంతో ఎన్నికల ముందు సదరు మున్సిపల్ అధికారిని పంపించేశారు. ఇప్పుడు మళ్లీ అదే మున్సిపాలిటీకి వచ్చేలా సదరు అధికారి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారుల వద్దకు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. త్వరలోనే మున్సిపాలిటీలో తన పదవీ బాధ్యతలు ముగియనున్నాయి. ప్రభుత్వం అంగీకరిస్తే పొడిగిస్తారు. లేదంటే వేరే చోటుకు పంపనున్నారు. ఇప్పటి వరకు పనిచేసిన మున్సిపాలిటీకి వచ్చేలా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎన్నికల ముందే కూటమి నేతను మూడు పర్యాయాలు కలిశారు. మెప్పు పొందే ప్రయత్నం చేశారు. అతనికే టిక్కెట్ వస్తుందన్న ఉద్దేశంతో ముందుగానే మున్సిపాలిటీలో డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారి ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారు. అతని ప్రయత్నాలు ఏవీ ఫలించేలా లేవు. వైసీపీ ప్రభుత్వంలో ప్రతిపక్షాలను ఇబ్బందులు పెట్టే వారికి ఈసారి అవకాశం ఇవ్వకూడదంటూ ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో కూటమి నాయకుల మధ్య చర్చలు సాగాయి.

నరసాపురం-విజయవాడ టిక్కెట్ ధర రూ.30



నరసాపురం, జూన్ 7: ఎక్స్‌ప్రెస్ రైళ్లతో సమానంగా ఉండే డెమో రైలు చార్జీలు భారీగా తగ్గాయి. గతంలో రూ.20 వున్న కనీస చార్జీ, నేడు రూ.5కు దిగి వచ్చింది. నరసాపురం నుంచి విజయవాడకు ఎక్స్‌ప్రెస్ టిక్కెట్ ధర రూ. 65. అదే డెమో రైలులో వెళితే రూ.30 మాత్రమే. భీమవరానికి రూ.10, నిడదవోలు రూ.20, గుడివాడకు రూ.25 మాత్రమే. గతంలో ఈ చార్జీలు రెట్టింపు ఉండేవి. భీమవరం నుంచి నిడదవోలు రూ.15 మాత్రమే. ప్రస్తుతం జిల్లాలో ట్రాక్ పనులు జరుగుతున్నందున కొన్ని డెమో రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. వాటిని పునరుద్ధరిస్తే రాజమహేంద్రవరం, విజయవాడ మధ్య రైళ్ల సంఖ్య పెరగనున్నాయి.



15 నుంచి వేట నిషేధం ఎత్తివేత

మత్స్యకారుల ఖాతాలో జమ కాని భృతి

నరసాపురం, మే 7 : నరసాపురం తీరంలో ఈ నెల 14 అర్ధరాత్రి నుంచి సముద్ర వేటపై నిషేధాజ్ఞలు ఎత్తి వేయనున్నట్టు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వేటకు వెళ్లేందుకు మత్స్యకారులు బోట్లకు మరమ్మతు పనులతోపాటు రంగులు వేస్తున్నారు. వలలను సిద్ధం చేస్తున్నారు. ఏటా నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, మచిలీపట్నం నుంచి బోట్లన్నీ నరసాపురం తీరానికి చేరుకుంటున్నాయి. ముందస్తు వర్షాలతో ఈ ఏడాది వేట అనుకూలంగా సాగుతుందన్న ఆశాభావంతో మత్స్యకారులు ఉన్నారు. ఏటా వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే భృతి ఈ ఏడాది ఇంకా జమ కాలేదు. రెండు నెలల కాలానికి రూ.20 వేలు ప్రభుత్వం సాయంగా అందిస్తుంది. సాధారణంగా మేలో ఈ మొత్తం అర్హులైన మత్స్యకారుల ఖాతాల్లో జమవుతుంది. ఈ ఏడాది ప్రభుత్వం దగా చేసింది. నిషేధ సమయం ముగుస్తున్నా ఇంత వరకు జమ చేయలేదు. నరసాపురంలో మొత్తం 1,773 మంది మత్స్యకారులు ఉన్నారు. వీరి బ్యాంకు ఖాతా, ఇతర వివరాలన్ని మత్స్య శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. నెల రోజుల నుంచి ఆ శాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ప్రయోజనం లేదు. దీంతో కొత్త ప్రభుత్వమన్నా భృతి సొమ్ము జమ చేస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

అప్సడా వైస్ చైర్మన్ పదవికి వడ్డి రాజీనామా

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 7: ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ పదవికి తాడేపల్లిగూడేనికి చెందిన వడ్డి రఘురాం నాయుడు శుక్రవారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి సమర్పించారు. 2026 మార్చి వరకూ తన పదవీ కాలం ఉన్నా వైసీపీ ప్రభుత్వం ఓటమి పాలవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

పందెం గెలిచినా..



నిండా మునిగిన పందెంరాయుళ్లు

- ప్రభుత్వం తమదేనంటూ బెట్టింగ్‌లు
- పశ్చిమలో రూ.300 కోట్లు కోల్పోయిన వైసీపీ కార్యకర్తలు

(భీమవరం/భీమవరం క్రైం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వాన్ని నమ్ముకుని ఆ పార్టీ శ్రేణులు తీవ్రంగా నష్టపోయారు. పందేలతో కోట్లు పోగొట్టుకున్నారు. రాష్ట్రంలో మళ్లీ జగన్ ప్రభుత్వం వస్తుందని జిల్లావ్యాప్తంగా దాదాపు రూ.300 కోట్ల మేర పందేలు కాశారు. ఉండిలో రఘురామకృష్ణరాజు ఓడిపోతారంటూ వైసీపీ శ్రేణులు పందేలకు దిగాయి. ఆరా మస్తాన్ ఎగ్జిట్ పోల్ ఫలితాలను చూసిన తర్వాత డెల్టా ప్రాంతంలో పందేలు కాసిన వారూ వున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక అంతా నష్టపోయారు. వైసీపీని నమ్ముకుని నట్టేట మునిగారు. జిల్లావ్యాప్తంగా సామాన్య కార్యకర్తలు జగన్ ప్రభుత్వంపై విశ్వాసంతో బెట్టింగ్‌లకు పాల్పడి నష్టపోయారు. కొందరైతే అప్పులు చేశారు. ఇప్పుడు ఆ కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయి. తాడేపల్లిగూడెంలో రూ.10 లక్షలు వస్తుందని ఓ కార్యకర్త లక్ష రూపాయలు పందెం కాశారు. కొట్టు సత్యనారాయణ మళ్లీ నెగ్గుతారంటూ ఆ పందం సారాంశం. అంటే తెలుగుదేశం నాయకులు ఒకటికి పది రెట్లు పందేలు నిర్వహించారు. కొట్టు ఓటమితో కార్యకర్త పందెం కోల్పోయాడు. ఏకంగా రూ.5 లక్షల వరకు సొమ్ము కోల్పోయాడు. ఇలా జిల్లాలో లక్షల రూపాయలు పందేలు కాసిన వారంతా రోడ్డున పడ్డారు. భీమవరంలో వైసీపీకి చెందిన నాయకుడు మధ్యవర్తిగా ఉన్నారు. అతని వద్ద రూ.2 కోట్ల వరకు ఇరు వర్గాలు సొమ్ములు దాచుకున్నారు. టీడీపీ కూటమి తరపున పందేలు కాసిన వారికి సొమ్ములు ఇవ్వాలి. కానీ, సదరు మధ్యవర్తి ఫలితాలు తర్వాత కనిపించకుండా పోయారు. ఉంగుటూరు మండలం కాకర్లమూడి అధికార పార్టీ నాయకుడు రూ.50 లక్షల వరకు తన వద్ద ఉంచుకున్నారు. పందేలు కాసిన వారంతా అతని పై నమ్మకం ఉంచారు. తాడేపల్లిగూడెం నుంచి పందే లు కలిపారు. తీరా ఫలితాలు అనంతరం సదరు నాయకుడు కుటుంబంతో సహా ఊరి వదలి వెళ్లిపోయాడు. ఇలా మధ్యవర్తులు ఎందరో జిల్లాలో కానరావడం లేదు. మరోవైపు పందెం కోల్పోయిన వారంతా వైసీపీని నమ్ముకుని నట్టేట మునిగామంటూ లబోదిబోమంటున్నారు.



30 కోట్లతో పరార్.. ఆచూకీ లభ్యం

పందెం నెగ్గినప్పటికి సొమ్ములు ఇవ్వకపోవడం ఘర్షణలు తలెత్తుతున్నాయి. భీమవరంలోని ఒక ప్రాంతంలో రూ.11.50 లక్షలు చెల్లించకుండా ఓడిన వాళ్ళు తప్పించుకుంటున్నారు. వారిని ఎంతో కష్టపడి పట్టుకోగా డబ్బులు లేవని ఉన్నప్పుడు ఇస్తామనే సమాధానంతో ఇరువురు ఘర్షణ పడ్డారు. ఒక బంగారు వ్యాపారి రూ.10 లక్షలకు మధ్యవర్తిత్వం వహించడంతో అవతల వారు డబ్బులు కోసం వస్తే సమాధానం సరిగా రాకపోవడంతో ఇరువురు ఘర్షణకు దిగిన ఘటనతో మార్కెట్‌లో ఉన్న వారు నివ్వెరపోయారు. పట్టణంలోనే రూ.30 కోట్లకుపైగా పందేల సొమ్ముకు మధ్యవర్తిగా వ్యవహరించిన ఓ వ్యక్తి కనిపించకపోవడంతో పందెగాళ్ళు ఆందోళన చెందారు. ఆ వ్యక్తి తనకు ఐదు శాతం కమీషన్ కావాలని చెప్పడంతో అందరూ అతన్ని నమ్మారు. ఆ వ్యక్తి డబ్బుపై ఆశతో అవతల ఎవరూ పందేలు కాయకపోయినా పందేలు ఉన్నట్టు కొందరిని నమ్మించి డబ్బులు వసూలు చేశాడు. చివరికి అతని ఆచూకీ గాలించగా గురువారం నల్గొండ జిల్లా కోదాడలో అతని ఆచూకీ లభ్యం అయినట్లు సమాచారం. దీంతో అతను చెప్పిన సమాధానం చూసి వారు నివ్వెరపోయారు. చివరకు వారు కాసిన పందేల సొమ్ము లేకపోవడంతో వారికి ఏమి చెయ్యాలో తెలియక అయోమయంలో ఉండిపోయారు. అయితే పరారైన వ్యక్తికి వైసీపీ నాయకుడి సపోర్టు ఉన్నట్లుగా చెబుతున్నారు.


ముంచేసిన మధ్యవర్తులు

(నూజివీడు):

చిన్న, మధ్యతరగతి వర్గాలు అప్పు చేసి మరీ లక్ష నుంచి రూ.పది లక్షల వరకు పందేలు కాసి పూర్తిగా నష్టపోవడంతో కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. బడా నాయకులు కోట్లు సంపాదించారు. మరోవైపు ఎన్నికల ఫలితాలపై సాగిన పందేల్లో మధ్యవర్తుల వ్యవహారశైలి పందెంరాయుళ్ళ కొంపముంచింది. పందెం వేసుకున్న ఇరువర్గాల సొమ్ములను మధ్య వర్తుల వద్ద పెట్టారు. కాని వీరు, ఈ సొమ్ముతో పందేలు కాశారు. మధ్యవర్తుల దెబ్బకు కొందరు పందెం రాయుళ్ళు పందెం వస్తుందనుకుంటే ఉన్న డబ్బులు పోవడంతో లబోదిబోమన్నారు. మరికొందరు తట్టాబుట్టా, ఇల్లు వాకిలి పశువులనన్నింటిని తెగనమ్మి డబ్బు చెల్లించాల్సి వచ్చింది. నూజివీడు మండలం తూర్పు దిగవల్లిలో ఓ మధ్యవర్తి వద్ద వుంచిన కోట్ల రూపాయలను తీసుకుని అతను పరారవడంతో పందెంరాయుళ్లు ఆయన ఇంటిపై దాడి చేశారు. ఇంటిలోని కారు, బంగారు వస్తువులు, ఫర్నీచర్ తీసుకుని వెళ్లిపోయారు. ఇదే మండలంలో మరో గ్రామ నాయకుడు ఇంటితో సహా అమ్మకానికి పెట్టి పందేల డబ్బులు కట్టారు. ఆగిరిపల్లి మండలంలోని ఒక గ్రామంలో మరో నాయకుడు సైతం మొత్తం ఆస్తిని అమ్మినా పందెం డబ్బులు కట్టే పరిస్థితి లేక, చేతులెత్తేశాడు.

పందేల వల్ల కొన్ని కుటుంబాలు ఉసురు తీసుకుంటున్నారు. ఆ పాపం తమకు అంటకూడదంటే ఏం చేయాలి. తిలా పాపం తలా పిడికెడు అన్న సామెత ఉండనే ఉంది. కోటి రూపాయలు పందెం రూపంలో వస్తే వాటిలో నుంచి ఓ లక్ష దానధర్మాలు చేస్తే సరి అని పందెం రాయుళ్ళు ఆ పాపాన్ని నివృత్తి చేసుకునేందుకు నూజివీడు నియోజకవర్గంలో తెర తీశారు. అనాథ ఆశ్రమాల్లో అన్నదానాలతోపాటు బాటసారులకు పలు రకాల సేవలు అందిస్తూ దానిని టీడీపీ గెలుపుపై సంబరాలు అంటూ పైపూతలు పూయడం విశేషం.

గుండె పదిలమేనా ? -7లో



పశువైద్యులకు శిక్షణ తరగతులు



శిక్షణకు విచ్చేసిన వైద్యులతో నరేంద్రనాథ్

తణుకు, జూన్ 7: రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో తణుకులోని రాష్ట్ర పశు ఆరోగ్య సంస్థలో పశు వైద్యులకు జాతీయ స్థాయి శిక్షణ తరగతులు శుక్రవారం నుంచి ప్రారంభించినట్టు పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి. సూర్యచంద్రరావు తెలిపారు. పెద్ద, చిన్న పశువుల శస్త్ర చికిత్సలకు సంబంధించి మూడు రోజులు పాటు ఎనిమిది మందికి, పెద్ద పశువుల పోషణ, చికిత్సలకు సంబంధించి ఐదు రోజుల పాటు పన్నెండు మందికి శిక్షణ ఇస్తామన్నారు. కోర్సు కో-ఆర్డినేటర్లుగా డాక్టర్ ఆర్.శ్రీధర్, డాక్టర్ వై.శ్రీనివాసులు వ్యవహరిస్తారన్నారు. పశు ఆరోగ్య సంస్థకు పూర్తిస్థాయి వసతులు సమకూర్చడంతో పాటు శిక్షణ తరగతులకు కావలసిన సహాయ సహకారాలను ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, తణుకు వెటర్నరీ ఇన్‌స్టిట్యూషన్ అభివృద్ధి సొసైటీ సెక్రటరీ ముళ్ళపూడి నరేంద్రనాథ్ సమకూర్చారని చెప్పారు.

శ్రీవారి సన్నిధిలో అంగర దంపతులు



ఆశీర్వాదం పొందుతున్న మాజీ ఎమ్మెల్సీ అంగర దంపతులు

పాలకొల్లు టౌన్, జూన్ 7 : రాష్ట్రంలో కూటమి గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మొక్కుకున్నారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో శుక్రవారం రామ్మోహన్ దంపతులు, ఆయన కుటుంబ సభ్యులు ద్వారకాతిరుమల వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. ఎన్‌డీఏ అధికారం చేపట్టబోతుందని భవిష్యత్తు అంతా బంగారు బాట అవుతుందన్నారు.

ఎన్డీఏ కన్వీనర్‌గా మోదీ ఎంపికపై హర్షం

భీమవరంటౌన్,జూన్ 7 :ఎన్డీఏ కన్వీనర్‌గా ప్రధాని మోదీని ఎంపిక చేసిన సందర్భంగా పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ ఆధ్వర్యంలో నరసాపురం పార్లమెంట్ పార్టీ కార్యాలయం వద్ద సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి.. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కాయిత సురేంద్ర, పితాని వెంకటేశ్వరరావు జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్, పెద్దేటి సుబ్బారావు, వబిలిశెట్టి ప్రసాదరావు, జి. తులసీరామ్, నాగబత్తుల రాజేంద్ర, ఎ.మణికంఠ, తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే నిమ్మలను కలసిన చంద్రప్రసాద్



పాలకొల్లు, జూన్ 7 : పాలకొల్లు ఎమ్మెల్యేగా మూడుసార్లు హ్యాట్రిక్ సాధించిన డాక్టర్ నిమ్మల రామానాయుడును ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ఎ.చంద్రప్రసాద్ బొకే ఇచ్చి అభినందించారు. పాలకొల్లు నుంచి భారీ మెజార్టీ సాధించారన్నారు.

వాసవిలో సీఎస్సీ డేటా సైన్స్ కోర్సు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 7: పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి నూతన సీఎస్సీ డేటా సైన్స్ కోర్సు ప్రారంభించడానికి అఖిల భారత సాంకేతిక విద్యామండలి నుంచి అనుమతి లభించినట్టు కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 60 సీట్లతో ప్రారంభించనున్న ఈ కోర్సు బహుళ ప్రాచుర్యంలో ఉందన్నారు. ఈ కోర్సుతోపాటు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో నడుపుతున్న 240 సీట్లకు మరో 60 సీట్లు, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్‌లో 180 సీట్లకు అదనంగా 60 సీట్లు, పాలిటెక్నిక్ విభాగంలో కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో అదనంగా మరో 60 సీట్లు మంజూరైనట్టు తెలిపారు. పాలకవర్గ ఉపాధ్యక్షుడు కోట్ల వెంకట రామకృష్ణారావు, పేరూరి బాలకాశియ్య, పాబోలు వెంకటేశ్వరరావు, టెక్నికల్ డైరెక్టర్ చెక్కా అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఫొటో లేకుండా బియ్యం అందించాలి



జగన్ ఫొటోను మూసివేస్తున్న టీడీపీ శ్రేణులు

ఆకివీడు, జూన్ 7 : ఇంటింటికి అందించే రేషన్ బియ్యం వాహనాలకు ఉన్న జగన్ ఫొటో కనబడకుండా బియ్యం, సరుకులు అందించాలని టీడీపీ డిమాండ్ చేసింది. శుక్రవారం పట్టణ పరిధిలో రేషన్ బియ్యం సరఫరాచేసే వాహనానికి ఉన్న జగన్ ఫొటోపై టీడీపీ శ్రేణులు కాగితాలు అంటించి మాట్లాడారు. ప్రభుత్వం మారినా సంబంధిత అధికారులు నిబంధనలు పాటించడంలేదని విమర్శించారు. బొల్లా వెంకట్రావు, గొంట్లా గణపతి, కిమిడి నాగరాజు, బచ్చు కృష్ణ, మోపిదేవి శ్రీను, మద్దా నరేష్, మీగడ నాగరాజు, దూబ సురేష్, శివ తదితరులు ఉన్నారు.

మొక్కలను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలి

భీమవరంటౌన్, జూన్ 7 :ప్రతి విద్యార్థి విధిగా మొక్కలను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని భీమవరం మున్సిపల్ కమిషనర్ ఎం. శ్యామల పిలుపునిచ్చారు. స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ గ్రేడ్-1 గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి జిల్లా సమన్వయ అధికారి మల్లుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 'పర్యావరణం పరిరక్షణ మనందరి బాధ్యత' అనే అంశంపై వక్తృత్వం, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా పర్యావరణ కమిటీ కన్వీనర్ కె.మాధవీలత, చెరుకువాడ రంగసాయి, అరసవిల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే సజావుగా ఎన్నికలు పూర్తి

భీమవరంటన్, జూన్ 7 : సార్వత్రిక ఎన్నికలు ప్రజల సహకారం వల్లే సజావుగా జరిగాయని భీమవరం ఆర్డీవో కె.శ్రీనివాసులురాజు అన్నారు. స్వీప్ యాక్టివిటీస్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవో శ్రీనివాసులు రాజును సత్కరించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల అధికారులకు అభ్యర్థులు, ఏజెంట్లు, ఓటర్లు అందరూ ఎంతో సహకారం అందించారని, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రోత్సహించి నడిపించారన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఎన్నికల అధికారులకు పోలీస్‌లకు ప్రజలు అందించిన సహకారం అద్వితీయమన్నారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాసులు రాజును సత్కరించారు. కంతేటి వెంకట్రాజు, నరహరి శెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జ్వరమొస్తే మలేరియా పరీక్ష చేయించుకోవాలి

పెంటపాడు, జూన్ 7: తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పెంటపాడు, ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ తోట రాజేష్‌కుమార్, డాక్టర్ పూజిత, డాక్టర్ మౌనిక అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో శుక్రవారం పెంటపాడు, ముదునూరు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఎవరికైనా జ్వరం వస్తే పీహెచ్‌సీలో మలేరియా పరీక్ష చేయించుకోవాలని సూచించారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు

నరసాపురం టౌన్/పాలకోడేరు/ఆకివీడు/గణపవరం, జూన్ 7: గ్రంథాలయం శాఖ ఆధ్వర్యంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. నరసాపురం పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో ముగింపు కార్యక్రమానికి కమిషనర్ వెంకటేశ్వరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు బహుమతులందించారు. లైబ్రరీ అధికారి కుమారి, బాబుశ్రీ, త్రినాథ్ సూర్యకుమారి, నళినిదేవి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు. పాలకోడేరు గ్రంథాలయంలో గ్రంథపాలకుడు బాలరాజు మాట్లాడుతూ విద్యార్థులకు మేథాశక్తి పెంచే విధంగా వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వమించి బహుమతులు అందించామన్నారు. ఆకివీడు శాఖ గ్రంథాల యంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దాసరి సత్యనారాయణ ఆధ్వర్యంలో చిన్నారులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ పుప్పాల పండు, లైబ్రేరియన్ పార్వతి తదితరులు ఉన్నారు. గణపవరం పిప్పర శాఖ గ్రంథాలయాల్లో పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.







ఆకివీడు, వల్లూరు, పాలూరు గ్రామాల్లో కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న కూటమి నాయకులు, కార్యకర్తలు

కూటమి సంబరాలు

ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులు
మోటారు సైకిళ్ల ర్యాలీలు
వాడవాడలా కేక్ కటింగ్‌లు

ఆచంట, జూన్ 7 : ఆచంటలో ఎమ్మెల్యేగా పితాని సత్యనారాయణ, రాష్ట్రంలో కూటమి భారీ విజయంతో మండలవ్యాప్తంగా ఆయా గ్రామాల్లో కూటమి శ్రేణులు సంబరాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం వల్లూరు, కొడమంచిలిలో కూటమి శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించి కేక్ కట్ చేసి బైక్ ర్యాలీ నిర్వహించారు. వల్లూరులో ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, సర్పంచ్ నేలపూడి బేబి, తాళం శ్రీనివాస్, దేవళ్ళ రమేష్, అరిమిల్లి సుబ్బారావు, ఏడిద శ్రీనివాస్, ఎస్.ఆదినారాయణ తదితరులున్నారు. కొడమంచిలిలో చిలుకూరి శ్రీను, బాలం వెంకట రమణ, మన్నె తేజ, బాలనాగు శ్రీనివాస్, ఎస్. శ్రీనివాస్, ఎం.నాగేశ్వరరావు, కట్టా సుబ్బారావు, తేజ తదితరులున్నారు.

ప్రజల తీర్పుతో ఏపీలో తొలగిన చీకట్లు

ఆకివీడు : ప్రజల తీర్పుతో రాష్ట్రంలో చీకట్లు తొలగిపోయాయని టీడీపీ సీనియర్ నాయకుడు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు అన్నారు. కూటమి విజయంతో తీగలదొడ్డి రామాలయం వద్ద పదిహేను కేజీల కేక్‌ను పార్టీ పట్టణ అధ్యక్ష-కార్యదర్శి బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, క్లస్టర్ ఇన్‌చార్జి గొంట్లా గణపతితో కలిసి కట్ చేసి మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి నౌకట్ల రామారావు, మోటుపల్లి సాయి అరవింద్, శిరప శ్రీను, వెంకన్నబాబు, రామరాజు, నరేష్, నాగరాజు తదితరులు ఉన్నారు. శ్రీనగర్ కాలనీలో, కుప్పనపూడి తదితర చోట్ల కేక్ కట్‌చేసి, మోటారు వాహనాలతో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో జాకీర్, అజ్మల్ తదితరులు ఉన్నారు. ఎస్వీ రంగారావు యూత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

నెగ్గిపూడి పంచాయతీలో..

పెనుమంట్ర : నెగ్గిపూడి గ్రామపంచాయతీ ఆవరణలో వార్డు సభ్యురాలు కొవ్వూరు సీతావెంకటనాగలక్ష్మి నేతృత్వంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. పార్టీలకతీతంగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతూ పాలకవర్గ సభ్యులందరూ కేక్ కట్ చేశారు. సర్పంచ్ మామిడిశెట్టి ధనలక్ష్మి, వార్డు సభ్యులు గుత్తుల సాల్మన్ దొర, కేతా భారతి, సాయి రెడ్డి, బాలాజీ రెడ్డి, వెంకటలక్ష్మి, నరసింహమూర్తి, సత్తి విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

పాలూరులో విజయోత్సవాలు

అత్తిలి : రాష్ట్రంలో కూటమి ఘన విజయం సాధించడంతో పాలూరులో విజయోత్సవాలు జరుపుకున్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం కేక్‌ను కట్ చేశారు. టీడీపీ మండల కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు అల్లూరి ధనరాజు, అల్లూరి రామకృష్ణంరాజు, వెంకట వెంకట్రాజు, కెడీల గోవిందు, అప్పలరాజు, గోపాలకృష్ణంరాజు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లోకేశ్, చంద్రబాబును కలసిన నాయకులు





నారా లోకేశ్‌ను కలసిన వలవల బాబ్జి , కోళ్ల నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 7: 'విజయంతో సంబరపడి పోవద్దు.. ప్రతి కార్యకర్తను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. అప్పుడే 2029లో మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలమంటూ' టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌బాబు దిశానిర్దేశం చేశారని టీడీపీ తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి వలవల బాబ్జి తెలిపారు. శుక్రవారం విజయవాడలో లోకేశ్‌బాబును మర్యాద పూర్వకంగా కలిసినట్టు తెలిపారు. బొలిశెట్టి శ్రీనివాస్‌ను గెలిపించినందుకు తనను అభినందించారని తెలిపారు. అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడిని కలసి సత్కరించినట్టు బాబ్జి తెలిపారు. గొర్రెల శ్రీధర్, పోతుల అన్నవరం, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పట్నాల రాంపండు, గంధం సతీష్, బండారు వెంకట్రావు, షేక్ బాజి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలసిన చంద్రశేఖర్

ఉండి : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఈనెల 12న ప్రమాణస్వీకారం చేయనుండడంతో ముందస్తుగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపినట్టు ఆల్ ఇండియా బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ చిప్పాడ చంద్రశేఖర్ తెలిపారు. హైదరాబాద్‌లో చంద్రబాబు నాయుడును కలిసినట్టు శుక్రవారం ఉండిలో వివరాలు తెలిపారు. కార్పెంటర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్, అచ్చెన్నాయుడిని కలసిన కోళ్ల

భీమవరం అర్బన్/భీమవరం టౌన్, జూన్ 7: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు ఉండవల్లి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

లోకేశ్‌కు రామ్, లక్ష్మణ్‌ల అభినందన

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 7: నారా లోకేశ్‌కు తెలుగు యువత జిల్లా అధ్యక్షులు పసుమర్తి రామ్, లక్ష్మణ్ శుక్రవారం అభినందనలు తెలిపారు. అమరావతిలోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి : పితాని

పెనుమంట్ర, జూన్ 7 : రానున్న వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విషజ్వరాలు, అంటువ్యాధులపై సర్వేలు చేపట్టాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఎంపీడీవోలను ఆదేశించారు. శుక్రవారం పోడూరు మండలం కొమ్ముచిక్కాల స్వగృహంలో ఎమ్మెల్యేగా ఎంపికైన పితాని సత్యనారాయణను కలిసి అభినందించేందుకు వచ్చిన అధికారులతో మాట్లాడారు. ప్రజల ఓటుహక్కుతో గెలుపొందిన ప్రజాప్రతినిధులను గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉందని, ప్రొటోకాల్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, నాలుగు మండలాల్లోనూ జడ్పీటీసీలు, ఎంపీపీలకు చాంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రొటోకాల్ విస్మరిస్తే చర్యలు తప్పవని అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాల్సిన అధికారులు గత పాలకులకు వత్తాసు పలికే పద్ధతి మార్చుకుంటే బాగుంటుందని లేకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పెనుమంట్ర పెనుగొండ పోడూరు ఆచంట మండలానికి సంబంధించి మండల తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, సచివాలయ సిబ్బంది, ఐకేపీ అధికారులు, మండల విద్యాశాఖ ఐసీడీఎస్ అధికారులు... పితాని సత్యనారాయణ కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

రొయ్యల ఫ్యాక్టరీ ఎదుట ఉద్యోగుల ఆందోళన

గణపవరం, జూన్ 7: సరిపల్లెలో మూసివేసిన రొయ్యల మేతల తయారీ ఫ్యాక్టరీని తిరిగి తెరవాలని, తొలగించిన ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు, కార్మికులు ఫ్యాక్టరీ ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సరిపల్లెలో గత పదకొండేళ్లుగా చేపలు, రొయ్యల మేతల తయారీ ఫ్యాక్టరీని థాయిలాండ్‌కు చెందిన యాజమాన్యం నిర్వహిస్తుంది. నష్టాల్లో ఉందని యాజమాన్యం ఉత్పత్తిని నిలుపుదల చేశారు. కొంతమంది ఉద్యోగులు ఇతర ప్రాంతాల్లోని ఫ్యాక్టరీల్లో విధుల్లో చేరారని, మిగిలిన 71 మంది ఉద్యోగులు పనిచేస్తున్నామని కొంతకాలంగా తమకు జీతాలు ఇవ్వకపోవడం, పని చూపకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కుంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని తొలగించిన ఉద్యోగులకు ఉపాధి కల్పించాలని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం కనిపించ లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

ఆకివీడు, జూన్ 7: పశువులకు గొంతువాపు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని వెటర్నరీ మండల వైద్యాధికారి భార్గవిసత్య అన్నారు. శుక్రవారం అయి-భీమవరంలో వెటర్నరీ ఆసుపత్రిలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసి మాట్లాడారు. మండలంలో సుమారు ఆరువేలు పశువులు ఉండగా ప్రస్తుతానికి వెయ్యి పశువులకు టీకాలు వేశామన్నారు. ఈనెలాఖరుకు రైతులు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ వ్యాధి ఎక్కువగా దూడల్లో కనబడుతుందని, వేసవిలో మేతలు సక్రమంగా తీసుకోకపోవడంతో పాటు ఎండా, వేడి, వానలకు తడిచి చలికి గురైనప్పుడు వ్యాధి నిరోధకశక్తి కోల్పోయి గొంతువాపు వ్యాధి బారిన పడతాయన్నారు. రైతులందరూ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలన్నారు.

కూటమిలో చేరిన వైసీపీ వార్డు సభ్యులు

ఆచంట/పెనుగొండ, జూన్ 7 : టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ విజయంతో ఆచంట పంచాయతీకి చెందిన వైసీపీ 2,3,7,9వ వార్డు సభ్యులైన మానేపల్లి సూర్యకుమారి, నిమ్మన సత్యనారాయణ, నెక్కంటి లక్ష్మీ దుర్గ, గురుజుకోట రాజ్యలక్ష్మి శుక్రవారం ఆచంటలో కూటమి సభ్యుల సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో కేతా మీరయ్య, జవ్వాది బాలాజీ, తమ్మినీడి ప్రసాద్, బీరా నరసింహమూర్తి, నిమ్మన శేఖర్ తదితరులు ఉన్నారు. పెనుగొండ మండలంలో పెనుగొండ 2, 12, 15 వార్డు మెంబర్లు చేవూరి శ్రీదేవి, దొమ్మేటి దేవి, మేడపాటి నీలిమ చేరారు.

ఆధ్యాత్మికం

దేశాలమ్మ సన్నిధిలో అన్నసమారాధన



దేశాలమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన

పాలకొల్లుఅర్బన్, జూన్ 7 : స్థానిక లాకు దిగువ చింతలతోటలో వున్న దేశాలమ్మ జాతర సందర్భంగా శుక్రవారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ 52వ వార్షికోత్సవం సందర్భంగా గత నెల 27వ తేదీ నుంచి జాతర నిర్వహించారు. ఈనేపథ్యంలో సుమారు 10 వేల మందికి భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ వలిరెడ్డి వరహాలు, కార్యదర్శి శిడగం చందు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- పెనుగొండ, జూన్ 7 : పెనుగొండ కంబాల వారి వీధిలో వున్న వరసిద్ధి వినాయక ఆలయ 18వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీఎత్తున ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులు పాల్గొన్నారు.

అర్హులకు టిడ్కో ఇళ్లు అందజేయండి : బొలిశెట్టి



రామరాజును కలిసిన బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 7: వైసీపీ కక్ష సాధింపులకు పరాకాష్ఠగా నిలిచిన టిడ్కో ఇళ్ళు అర్హులైన వారికి త్వరితగతిన అందజేయాలని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జనసేన పార్టీ కార్యాలయంలో టిడ్కో ఇంజనీర్లతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పూర్తికాని ఇళ్ళ పరిస్థితి, మౌలిక వసతులపై ఆరా తీశారు.

ప్రముఖులను కలసిన బొలిశెట్టి

భీమవరం అర్బన్/తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 7 : టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) లను బొలిశెట్టి వారి నివాసాల వద్ద మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్‌ను రామరాజు పూలమాల, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. భీమవరం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. తాడేపల్లిగూడెంలో పెండింగ్ పనులపై చర్చించారు. అనంతరం తాడేపల్లిగూడెం జనసేన పార్టీ కార్యాలయంలో పెంటపాడు ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ, కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కేకును కట్ చేశారు.

ఈ-పోస్ట్‌తో నాయకులకు శుభాకాంక్షలు తెలపండి

భీమవరం అర్బన్, జూన్ 7: సార్వత్రిక ఎన్నికలలో విజేతలుగా నిలిచిన నాయకులకు ఈ-పోస్ట్ ద్వారా అభినందనలు తెలిపేందుకు తపాలాశాఖ వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు భీమవరం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ ఎన్వీ సత్యనారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విజయం సాధించిన ప్రతిప్రజాప్రతినిధికి ఈ పోస్ట్ సందేశాల ద్వారా అభినందనలు తెలిపాడానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు, అభిమానులు తమ దగ్గరలోని పోస్టాఫీసుకు వెళ్లి రూ.10 చెల్లించి ఈ-పోస్ట్ ద్వారా ప్రియతమ నేతకు శుభాకాంక్షలు పంపించవచ్చన్నారు. ఇలా పంపిన సందేశాలు దేశంలోని ఏ చిరునామకైనా నేరుగా మీ ప్రియతమ నాయకుని చేతికి చేరుతాయన్నారు.

యానాది కుటుంబాలకు భోజనాలు అందజేత

భీమవరం అర్బన్, జూన్ 7: ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో భీమవరం గొల్లవానితిప్ప రోడ్‌లోని డంపింగ్ యార్డ్ వద్ద యానాది కుటుంబాలకు భోజనాన్ని అందించారు. అల్లు శ్రీనివాస్ మట్లాడుతూ మానవులకు నీరు, ఆహారం అవసరమని జనసాంద్రత బట్టి ఆహార ధాన్యాలు, నిత్యావసరాలు నిల్వ ఉంచుకోవాలన్నారు. ఆహార పదార్థాలను వ్యర్థాలుగా పారవేయకుండా మితంగా ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇందుకూరి శివాజీవర్మ, వాల్మీకి, బాలాజీ పాల్గొన్నారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి న్యూరోసర్జన్ రాక

పెంటపాడు, జూన్ 7: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 9న విజయవాడ నుంచి ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ తీగల రమేష్ విచ్చేస్తున్నారని ట్రస్టు ఛైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. తల, మెదడు, వెన్నెముక, నరాలకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిర్మాణ కార్మికుడి చికిత్సకు చేయూత

తణుకు, జూన్ 7:కోనసీమ జిల్లాకు చెందిన తాపీమేస్త్రి కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ బిల్డింగ్‌పై పనిచేస్తున్న సమయంలో విద్యుత్ వైర్లు తగిలి తీవ్రగాయాలపాలై రాజమండ్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. క్షతగాత్రుడు ఆర్థిక సాయం కోసం అర్థించడంతో జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజమండ్రి వెళ్ళి దుర్గాప్రసాదు కుటుంబీకులకు యూనియన్ తరపున రూ.22 వేలు అందించినట్టు నాయకులు తెలిపారు. నెల్లూరు జిల్లాకు చెందిన పేరం సుబ్బారాయుడు కాలికి గాయం కావడంతో రూ.9,250 అందించామన్నారు. జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు, ప్రధాన కార్యదర్శి పడాల ఆదినారాయణ, మైలవరపు శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు శర్మ మృతి



శర్మ (ఫైల్)

పాలకొల్లు అర్బన్, జూన్ 7:పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీపాద సీతారామశర్మ(91) గురువారం రాత్రి మరణించారు. ఆయనకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. ఆయన 20వ ఏట పీటీటీగా ఉద్యోగంలో చేరి 1992లో జిన్నూరు హైస్కూల్లో పదవీ విరమణ చేశారు. కరోనా సమయంలో ఉద్యోగ బాధ్యతల నుంచి తప్పుకుని ఇంటి వద్దనే ఉంటున్నారు. మంచి ఉపాధ్యాయుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన మరణం పట్ల పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, బ్రాహ్మణ సంఘాల నాయకులు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్ఆర్ఆర్‌తో నియోజకవర్గం మరింత అభివృద్ధి



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసిన టీడీపీ శ్రేణులు

ఆకివీడు, జూన్ 7: ఆర్ఆర్ఆర్‌తో నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధ్యమని, ప్రజలు సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకున్నారని టీడీపీ మండల, పట్టణ అధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. వైసీపీ పాలనలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రామరాజుకు తగిన గుర్తింపునివ్వకుండా అవమానించారన్నారు. టీడీపీ పాలనలో అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. అనంతరం రాష్ట్ర రైతు నాయకుడు భూపతిరాజు తిమ్మరాజు, మండల-పట్టణ ప్రధాన కార్యదర్శులు నౌకట్ల రామారావు, గంధం ఉమా, క్లస్టర్ ఇన్‌చార్జి గొంట్లా గణపతి మాట్లాడారు. పార్టీ కౌన్సిలర్లు బొల్లా వీరశ్వేత, కిమిడి అరుణకుమారి, బత్తుల శ్యామల, మోపిదేవి సత్యవతి, అధికార ప్రతినిధి బొర్రా సుజాత ఉన్నారు.

రఘురామది చారిత్రాత్మక విజయం



కుముదవల్లి టీడీపీ నాయకులు

పాలకోడేరు, జూన్ 7: ఉండి నియోజకవర్గంలో కనుమూరి రఘురామ కృష్ణరాజు భారీ మెజార్టీతో చారిత్రాత్మక విజయం సాధించారని టీడీపీ సీనియర్ నాయకుడు భూపతిరాజు శ్రీకృష్ణవర్మ, మధువర్మ అన్నారు. కుముదవల్లి గ్రామంలో కూటమి గెలుపుతో పార్టీ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాణసంచా కాలుస్తూ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ స్వీట్లు పంపిణీ చేశారు. శ్రీనివాసరాజు, వెంకటేశ్వరరాజు, థామస్ సుధాకర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆచంట ఎమ్మెల్యే పితానికి అభినందనలు



పెనుగొండలో పితానికి కూటమి నాయకుల సత్కారం

పెనుగొండ/ఆచంట, జూన్ 7 : ఆచంట టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ భారీ మెజార్టీతో విజయం సాధించడంతో పెనుగొండ, ఆచంట మండలాల నుంచి పెద్దఎత్తున కూటమి శ్రేణులు శుక్రవారం పితాని నివాసానికి వెళ్లి అభినందనలు తెలుపుతున్నారు. టీడీపీ, జనసేన శ్రేణులు బైక్ ర్యాలీలతో వెళ్లి పితానికి అభినందనలు తెలిపారు. పెనుగొండ మండలం నుంచి గెద్దాడ చిన్న, తానేటి శేకర్, కడిమి వెంకటేశ్వర్లు, ఉండ్రాజవరపు జోషఫ్, తానేటి నాగరాజు, తానేటి బొనగియ, రాపాక ఆశీర్వాదం, కంకిపాటి వెంకటేశ్వర్లు, కడిమి శామ్యూల్, రాపాక నాగరాజు పాల్గొన్నారు. ఆచంట మండలం నుంచి ఎంపీడీవో పి.నరసింహప్రసాద్‌బాబు, సిబ్బంది, తహసీల్దార్ ఐపీశెట్టి, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మలకు అభినందనలు



నిమ్మలకు ప్రెస్‌క్లబ్ సభ్యుల అభినందనలు

పాలకొల్లు అర్బన్, జూన్ 7 : మూడోసారి ఎమ్మెల్యేగా నెగ్గి హ్యాట్రిక్ సాధించిన ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడును గురువారం పలువురు అభినందించారు. గురువారం టీడీపీ కార్యాలయంలో అభిమానులు, ఉద్యోగుల అభినందనలు తెలిపారు. ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు ఎమ్మెల్యే నిమ్మలకు శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌వీ సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు, ఐజేయూ సభ్యులు ముత్యాల శ్రీనివాస్, సీనియర్ సభ్యులు, ఉపాధ్యాయ సంఘనాయకులు, వై. ప్రభాకర శాస్త్రి, జి.లక్ష్మీనారాయణ, ఆర్‌అండ్‌బీ శాఖ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ మున్సిపల్ శాఖల అధికారులు ఉన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి : ఆరిమిల్లి



ఆరిమిల్లిని అభినందిస్తున్న పండ్ల వర్తక సంఘం నాయకులు, సభ్యులు

తణుకు, జూన్ 7: ప్రజలకు మెరుగైన సేవలందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సూచించారు. శుక్రవారం టీడీపీ క్యాంపు కార్యాల యంలో పలు శాఖల అధికారులు, సంఘాల నాయకులు విచ్చేసి ఆయనను సత్కరించారు. భారీ మెజార్టీ అందించినందుకు ఆరిమిల్లి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఆశలకనుగుణంగా పాలన ఉంటుందన్నారు. పండ్ల వర్తక సంఘం, రవాణా, ఆరోగ్య, రెవెన్యూ, మండల పరిషత్, హౌసిం గ్, చాంబర్ ఆఫ్ కామర్స్, బులియన్ మర్చంట్స్, భవన నిర్మాణ, కార్పెంటర్ సంఘాలు ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు.

షరీఫ్‌కు టీడీపీ నాయకుల అభినందనలు



షరీఫ్‌ను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

నరసాపురం టౌన్, జూన్ 7 : ముస్లిం ఓటర్లు అత్యధికంగా ఉన్న రాయలసీమతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కూటమి విజయం కోసం ఎన్నికల ప్రచారం చేసి గెలుపునకు కృషి చేసిన శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఏ షరీఫ్‌ను శుక్రవారం టీడీపీ నాయకులు అభినందించారు. పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో ఆయనకు బొకే అందించి అభినందించారు. ఈ సందర్భంగా పొత్తూరి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి అంకిత భావంతో పనిచేస్తున్న షరీఫ్‌కు పార్టీ అధిష్ఠానం త్వరలో కీలక పదవినిస్తుందన్నారు. టీడీపీ నాయకులు జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, కొల్లు పెద్దిరాజు, గుబ్బల నాగరాజు, అనంతరామారావు, వాతాడి ఉమా, షేక్ హుస్సేన్, కోరాడ పాపారావు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాయకర్‌కు అభినందనలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

నరసాపురం టౌన్, జూన్ 7 : ఎమ్మెల్యేగా ఎన్నికైన బొమ్మిడి నాయకర్‌ను శుక్రవారం మునిసిపల్ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలసి అభినందించారు. కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డీఈ రమేష్‌బాబు, శేషగిరి, కుమారి,నానాజీ, రామారావు తదితరులు జనసేన కార్యాలయానికి వెళ్లి బొకే ఇచ్చి అభినందించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో టీడీపీ విద్యా సెల్ అధ్యక్షుడు, రాయల్ బేకరి అధినేత అంబటి ప్రకాష్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి, నళిని, పలువురు మహిళలు నాయకర్‌కు బొకే అందించి అభినందనలు తెలిపారు.

ప్రతి మంచిపనికి సహకారం అందిస్తా : ఎమ్మెల్యే పులపర్తి



పూడికతీత పనులు పరిశీలించిన ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరంటౌన్, జూన్ 7 : భీమవరం నియోజకవర్గంలో జరిగే ప్రతి మంచి పనిలో సహాయ పూర్తి సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. రాయలం మంచినీరు చెరువులోకొళ్లే పంట కాలవను మాజీ సర్పంచ్ కోళ్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో కాల్వలో పూడిక తీసే పనులను ఆయన పరిశీలించి వారితో మాట్లాడారు. భీమవరాన్ని మోడల్ నియోజక వర్గంగా అభివృద్ధి చేసుకుందామన్నారు. సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు కోళ్ల సీతారాం, కోళ్ల నాగబాబు, మాజీ ఎంపీటీసీ వినాయక, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ ఎన్జీవోల సంఘం నాయకులు

ఎన్నికల కోడ్ ఉల్లంఘనతో సస్పెండైన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి


ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 7 : ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా వివిధ కారణాలతో జిల్లాలో ఇటీవల సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగ, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందిపై సస్పెన్షన్ ఎత్తివేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని శుక్రవారం ఏలూరులో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రామారావు తదితరులు కలుసుకుని వినతిపత్రం అందజేశారు. దీనిపై త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారని ఎన్జీవో నేతలు వివరించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పూర్తిచేసినందుకు కలెక్టర్‌ను అభినందిస్తూ పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఎన్జీవోల సంఘ ఏలూరు తాలూకా అధ్యక్షుడు జి.శ్రీధర్‌రాజు, కార్యదర్శి కె.సత్యనారాయణ, మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలను అందజేస్తున్న దినేష్ శంకర్‌రెడ్డి తదితరులు

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 7 : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. ఏపీ నిట్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై 8,9,10 తరగతుల విద్యార్థులకు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సెలవులలో సైతం ఇక్కడకు వచ్చి త్రీడి ప్రింటింగ్ నేర్చుకోవడం అభినంద నీయమన్నారు. విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే పాఠ్యాం శాలపై పట్టు సాధించడంతో పాటూ నిత్యం ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చు కోవడం బాల్యం నుంచి అలవాటు చేసుకోవాలన్నారు. శిక్షణ తీసుకున్న 44 మంది విద్యార్థులకు ప్రశంశా పత్రాలను అందజేశారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టీ.బాబూరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కార్తికేయ శర్మ, ఆచార్యులు డాక్టర్ సందీప్ పాల్గొన్నారు.



నివేదిక అందిస్తున్న ఉప కులపతి జానకిరామ్

జీడిమామిడి పంటపై పరిశోధన నివేదిక

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 7: జీడిమామిడి పంటపై ఐదేళ్లపాటు దేశ వ్యాప్తంగా చేసిన పరిశోధనల నివేదికను (క్యూఆర్టీ)ని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ ఉపకులపతి, జీడిమామిడి పరిశోధనల సమీక్ష కమిటీ ఛైర్మన్ డాక్టర్ టి.జానకీరామ్ న్యూ ఢిల్లిలోని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్‌కు శుక్రవారం సమర్పించారు. ఈ నివేదికలో జీడిమామిడి పంట జాతీయ సగటు హెక్టారుకు 750 కేజిల దిగుబడి ఉండగా రాష్ట్రంలో హెక్టారుకు 2 వేల కేజీలు సాధించేలా చూడటం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, తదితర అంశాలు పొందుపర్చినట్లు జానకి రామ్ వివరించారు.

నేడు విజయవాడలో రేషన్ డీలర్ల సంఘ సమావేశం

ఉండి, జూన్ 7: రాష్ట్ర రేషన్ డీలర్ల సమావేశం విజయవంతం చేయాలని ఉండి మండలం రేషన్ డీలర్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెన్నంశెట్టి బాబి, గాదిరాజు రామాంజనేయరాజులు కోరారు. శుక్రవారం ఉండిలో ఈ మేరకు పత్రికలకు వివరాలను అందించారు. విజయవాడలోని వంగవీటి మోహనరంగా ఇంటి పక్కన వున్న మాకినేని బసవపున్నయ్య విజ్ఞానభవన్‌లో (కమ్యూనిస్ట్ ఆఫీసు) శనివారం ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. డీలర్లు, సంఘనాయకులు హాజరుకావాలని కోరారు. నూతన ప్రభుత్వం ముందుకు తమ సమస్యలను తీసుకుని వెళ్లి చర్చించి పరిష్కరించుకోనున్నట్లు తెలిపారు. మండల డీలర్లు మురళీకృష్ణంరాజు,కొమ్మన నాగబాబు,లక్ష్మణ కుమార్ గుప్తా పాల్గొన్నారు.

నేటి నుంచి మావుళ్ళమ్మ జ్యేష్టమాస జాతర

భీమవరంటౌన్, జూన్ 7 : మావుళ్ళమ్మ జ్యేష్టమాస జాతర ఉత్సవాలు ఈనెల 8 వతేదీ నుంచి వచ్చేనెల 5 వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ బుద్దామహాలక్ష్మి గణేష్ తెలిపారు. శనివారం సాయంత్రం 5-25 నిమిషాలకు ఆలయంలో అమ్మవారిని నెలబెడతారన్నారు. పూజల అనంతరం మంగళవాయిద్యాలతో అమ్మవారి గరగలను ఊరేగింపుగా గరగల గుడి వద్దకు తీసుకువెళ్లి అక్కడ ఉంచుతారని తెలిపారు.21 నుంచి 29 వరకు అమ్మవారు గ్రామంలో పర్యటించి భక్తుల నుంచి పానకాలను స్వీకరిస్తారన్నారు. 13వ తేదిన గవళ్ళ గుడుపు, 20న అమ్మవారికి నైవేద్యాలు,దేవస్థానం ఆధ్వర్యంలో జాతర నిర్వహిస్తామన్నారు. 27వ తేదీన నీరుల్లి కూరగాయ పండ్లవర్తక సంఘం, దేవస్థానం, మావుళ్ళమ్మ ఉత్సవ కమిటీ అధ్వర్యంలో సాయంత్రం జాతర నిర్వహిస్తామన్నారు. వచ్చేనెల 3న అమ్మవారికి నైవేద్యాలు, దేవస్థానం ఆధ్వ ర్యంలో రాత్రిసేవ నిర్వహించి 4వ తేదీ తెల్లవారుజామున ఉదయం 5-30 నిమిషాలకు ఆలయంలో అమ్మవారికి ఊయ్యాల సేవ నిర్వహించి గరగలను మూల విరాట్ వద్ద ఉంచటంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.



ముసునూరులో నేలకు ఒరిగిన అరటిపంట

అరటి రైతులకు అపార నష్టం

ముసునూరు, జూన్ 7: ముసునూరు మండలంలో మూడు గ్రామాల్లో వీచిన ఈదురుగాలుల బీభత్సానికి అరటి పంట తీవ్రంగా దెబ్బతింది. పంట చేతికి వచ్చి గెలలు నరికే సమయంలో పంట నేలపాలై ఆర్థికంగా రైతులకు నష్టపోయారు. ముసునూరులో సూమారు 100 ఎకరాలపైగా అరటిపంట దెబ్బతింది. ముసునూరుకు చెందిన కౌలు రైతు చింతా సూరిబాబు సాగుచేసిన 5 ఎకరాల అరటిపంట గెల దశలో ఉండగా ఈదురుగాలులకు పూర్తిగా నేలకు ఒరిగిపోయింది. సూమారు రూ. 5 లక్షలు నష్టమని రైతు వాపోయాడు. అలాగే మరో కౌలురైతు కొత్త విజయకుమార్‌కు చెందిన ఐదు ఎకరాల పంట తీవ్రంగా దెబ్బతినడంతో కౌలుతో కలిపి రూ. 10 లక్షలు నష్టం వాట్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రైతులు కొప్పుల శ్రీనివాస రావు, తుట్లిమెల్లి రంగరావు, మానికల కొండలుతోపాటు మరికొంతమంది రైతుల అరటిపంట నేలకొరగడంతో నష్టపోయారు. చింతలవల్లి, గోగులంపాడు గ్రామాల్లో సైతం ఈదురుగాలులకు అరటిపంట నేలమట్టం అయింది. నోటిదగ్గరకు వచ్చిన పంట ప్రకృతి వైపరీత్యానికి నేలపాలైవడంతో ఆర్థికంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

హృదయం.. పదిలమేనా ?



చిన్న వయసులోనే గుండెపోటు

కొవిడ్ తరువాత పెరిగిన కేసులు

ఆందోళన కలిగిస్తున్న మరణాలు

అలవాట్లే కొంప ముంచుతున్నాయి

తగిన జాగ్రత్తలతో ఆరోగ్యం



పాలకొల్లు, జూన్ 7: పని ప్రాయం మొదలు కొని నడి వయసు, వృద్ధాప్యం ఇలా వయో బేధం లేకుండా గుండెపోటు అన్ని వయసుల వారిని కబలించి వేస్తున్నది. ఇటీవల కాలంలో ప్రతీ పది మరణాలల్లో కనీసం రెండు గుండె పోటు మరణాలు కనిపిస్తున్నాయి. కొవిడ్ తరువాత గుండె పోటు మృతుల సంఖ్య పెరిగినట్లు పలు అధ్యయనాల్లో తేలింది.ఆకస్మికంగా వచ్చే గుండె పోటు మరణాలు సర్వత్రా ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక్కసారిగా అపస్మారక స్థితికి చేరుకోవడం, కనుమూయడం జరుగుతుంది.

నిద్రలోనే గుండెపోటు

ఐసీఎంఆర్ అధ్యయనం ప్రకారం తీవ్రమైన కొవిడ్ బారిన పడిన వారు ఇటీవల గుండెపోటుకు గురవుతున్నారు. కొవిడ్‌బారిన పడిన వారు పరుగెత్తడం, అధిక వ్యాయామానికి దూరంగా ఉండటం, అధిక శ్రమతో కూడిన పనులు జోలికి వెళ్లకపోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. కొవిడ్ బారిన పడినవారు రెండుమూడు సంవత్సరాలు పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా గుండెపోటుకు దూరంగా ఉండవచ్చునని చెబుతున్నారు. మారిన ఆహార అలవాట్లు కారణంగా గుండె పోటుకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో పలువురు నిద్రిస్తున్న సమయంలోనే గుండె పోటుకు గురవుతున్నారు. తెలియకుండానే ప్రాణాలు వదులుతున్నారు. ఇది సర్వత్రా ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రముఖ కన్నడ నటుడు ఒకరు నిద్రలోనే గుండెపోటుతో మృతి చెందారు.

మారిన అలవాట్లతోనే ఇబ్బందులు



రెండు దశాబ్దాలకు ముందు 45 సంవత్సరాల వయసు లోపు పది శాతం మాత్రమే మాత్రం గుండె పోటు కనిపించేది. 40 సంవత్సరాలు పైబడిన వారిలో అధికంగా గుండెపోటు మరణాలు కనిపించేవి. ఇపుడు హైస్కూలు విద్యార్థుల స్థాయి నుంచి అన్ని వయసుల వారిని గుండెపోటు వదలడం లేదు. దీనికి ప్రధాన కారణం డయాబెటిక్, హైపర్ టెన్షన్ ఊబకాయంగా పేర్కొంటున్నారు. గుండెలో రక్తం గడ్డ కడితే గుండె పోటుకు గురవుతారు. ప్రాథమికంగా కళ్లకు చీకట్లు రావడం, తల తిరగడం, శ్వాసలో ఇబ్బందులు చాతీ నొప్పి ప్రధానంగా గుండె పోటు లక్షణాల్లో కనిపిస్తాయి. మారిన ఆహా రపు అలవాట్లు కలుషిత ఆహారం, సమయ పాలన లేకపోడం, పని ఒత్తిడి, మానసిక ఆందోళన, ఆర్థిక ఇబ్బందులు, కిడ్నీ సమస్యలు ఇంకా పలు ఇతర సమస్యలతో పాటు వంశ పారంపర్యంగానూ గుండెపోటు మరణాలు సంభవిస్తున్నాయి.

ప్రధాన కారణాలు

అధికంగా చెక్కర, కొవ్వు పదార్థాలు ఉన్న ఆహారం వల్ల రక్త నాళాలు మూసుకుపోతాయి. ఆ సమయంలో గుండెకు ఆక్సిన్ అందక గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. కొవ్వు అధికంగా ఉండే ఫాస్ట్ ఫుడ్ అధికంగా తినడం, వ్యాయామం చేయకపోవడం, పొగ తాగడం, మద్యం సేవించడం, ఆలోచనలతో ఒత్తిడికి గురి కావడం, కొవ్వు శాతం అధికంగా ఉండటం, రక్త పోటు, మధుమేహం ప్రధాన కారణాలు.

ప్రధాన పరీక్షలు

చాతిలో నొప్పి ఉన్నటువంటి వ్యక్తులు ముందుగా ఈసీజీ పరీక్షలు చేయించుకోవాలి. అందులో ఏ విధమైన తేడా కనిపించినట్లైతే 2డీ ఎకో, టీఎంటీ యాంజియోగ్రామ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా లక్షణాలు తెలుస్తాయి. ఇటీవల కాలంలో గుండెపోటుతో ప్రముఖ వైద్యులు సైతం మృత్యువాత పడు తున్నారు. రెండు రోజులు క్రితం విధి నిర్వహణలో ఉన్న పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ గుండెపోటుతో మరణించారు.మొన్నటికి మొన్న ఉండిలో ఒక ఉపాధ్యాయుడు గుండె పోటుకు గురై ప్రాణాలు వదిలారు. సుమారు మూడు నెలలు క్రితం విజయవాడలోని ప్రముఖ హార్ట్ సర్జన్ గుండెపోటుతో తనువు చాలించారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

రోజూ కనీసం అరగంట వ్యాయామం చేయాలి. పురుషులు 40 సంవత్సరాలు, మహిళలు 50 సంవత్సరాలు తరువాత గుండె పనితీరును క్రమంగా చెక్ చేయించుకోవాలి.జంక్ ఫుడ్, దూమ,మద్యపానాలకు దూరంగా ఉండాలి. రోజుకు 8 గంటలు నిద్ర అవసరం. మధ్యాహ్నం వేళ నిద్ర గుండె, మెదడు పనితీరు మెరుగు పరుస్తుంది. యోగా వల్ల గుండెకు ఒత్తిడి తగ్గుతుంది.

భుజం నుంచి ఎడమ చేతి కిందివరకు తీవ్రంగా నొప్పి వస్తే గుండె పోటుకు తొలి సంకేతంగా భావించాలి. శ్వాస ఇబ్బందులు, అధికంగా చెమటలు పట్టడం,అలసట ఉంటే డాక్టర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

ప్రతీ ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. సీపీఆర్ (కార్డియో పల్మరీ రిసర్స్ టేషన్) చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చు. స్ట్రోక్‌కు గురైన వ్యక్తుల ఛాతీపై 30 నుంచి 40 సార్లు గట్టిగా ఒత్తడం, నోటిలోకి గాలి ఊదడం ద్వారా ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చు.

ఇటీవల కాలంలో భారతీయులలో గుండె బలం క్షీణిస్తుండంతో మరణాలు పెరుగుతున్నాయి. 2015 లెక్కలు ప్రకారం దేశంలో 6.5 కోట్ల మంది గుండెజబ్బుతో బాధపడుతున్నారు. వారిలో 2.5 కోట్ల మంది 40 సంవత్సరాలు లోపు వారే.

నిద్రలేమి ప్రధాన కారణం



ఇటీవల కాలంలో యువత అర్ధరాత్రి వరకు మేల్కొని ఉంటున్నారు. నిద్రలేమి కారణంగానూ గుండెపోటు సంభవిస్తుంది. ముఖ్యంగా ఆహారపు అల వాట్లు మార్చుకోవాలి. వ్యాయామం చేయాలి. కనీసం 8 గంటలు నిద్రపోవాలి. నిద్ర లేమి కారణంగా బీపీ వచ్చి తదనంతరం అది దీర్ఘకాలికంగా మారి గుండెపోటుకు గురయ్యే అవకాశం ఉంది. తగిన ఆహారపు అలవాట్లు , వ్యాయామం, మానసిక ప్రశాంతతోనే గుండెపోటును నివారించవచ్చు. ఇటీవల వీడీ వెంట్రిక్యులర్ మరణాలు ఎక్కువ అవుతున్నాయి.

-డాక్టర్ యజ్ఞవర్మ, ఎండీ, పాలకొల్లు

స్ట్రీట్ ఫుడ్ జోలికి వెళ్లవద్దు



ఇటీవల కాలంలో ఇంటిపట్టున ఉండి ఆహారం తీసుకునేవారి సంఖ్య తగ్గింది. అధిక శాతం కలుషిత ఆహారం వల్ల శరీరంలోని వివిధ బాగాల పనితీరు మారుతున్నది. దీంతో గుండె పోటుతో పాటు పలు సమస్యలు ఎదురవుతున్నాయి. వంశ పారంపర్యంగా కొందరు గుండెపోటుకు గురైతే వ్యాయామం, నడక లేకపోవడం,శక్తికి మించి ఆలోచన చేయడం, స్ట్రెస్ తదితర కారణాలు గుండెపోటుకు గురి చేస్తున్నాయి. ఇటీవల పిల్లలు కూడా గుండెపోటుకు గురవడానికి కారణం వ్యాయామం లేకపోవడమే. పాఠశాలలో క్రీడా మైదానాలు ఉండడం లేదు. దీంతో పిల్లల్లో ఊబకాయం పెరగడంతో గుండె పోటు సంభవిస్తుంది.

- డాక్టర్ శిరిచందన, డీఎన్‌పీ జనరల్ మెడిసిన్

మా జిల్లాకు పంపేయండి



పోలీస్ శాఖలో బదిలీల కోసం ఎస్ఐ, సీఐలు ఎదురు చూపులు

ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు బదిలీ

కుటుంబాలకు దూరంగా ఉంటూ విధులు

మళ్లీ తమ ప్రాంతానికి వెళ్లేందుకు ప్రయత్నాలు

నూతన ప్రజా ప్రతినిధులతో సిఫారసులు

ఏలూరు క్రైం, జూన్ 7 : సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. కూటమి జైకేతనం ఎగురవేసింది. ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు ప్రారంభం అయ్యాయి. ఎన్నికలకు ముందు ఒకే జిల్లాలో మూడేళ్ల పనిచేసిన సీఐ, ఎస్ఐలను వేరే జిల్లాలకు బదిలీ చేయాలని అప్పటి ఉన్నతాధికారుల ఆదేశాలు ఉండడంతో ఏలూరు రేంజ్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలను బదిలీ చేశారు. మార్చి 16 నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈనెల 6వ తేదీ సాయంత్రం ఎన్నికల కోడ్ ఎత్తివేశారు. ఇప్పటికే ఎన్నికల నేపథ్యంలో పక్క జిల్లాలకు బదిలీపై వెళ్లిన ఎస్ఐ, సీఐలు అక్కడ ఒంటరిగా రూమ్ తీసుకుని విధులను నిర్వర్తిస్తూ కుటుంబాలకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం కోడ్ ముగియడంతో తమ కుటుంబ సభ్యులు ఉంటున్న జిల్లాలకు బదిలీ చేయించుకోవడానికి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో పనిచేస్తున్న కొంతమంది ఎస్ఐలు, సీఐలు శుక్రవారం ఏలూరు నగరానికి వచ్చి రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తమ గోడు వినిపించారు. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడిన వెంటనే బదిలీలు జరుపుతామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ లోపు నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులతో సిఫార్సులు చేయించుకోవడానికి ఇప్పటికే తమ బంధువుల ద్వారానో, స్నేహితుల ద్వారానో కొంత మంది ఎస్ఐలు, సీఐలు రంగంలోకి దిగారు. వైసీపీ ప్రభుత్వంలో లైప్ లైన్‌గా వెళ్లిపోయిన వారంతా ఇప్పుడు బయటకు వచ్చి తమకు జరిగిన అన్యాయాన్ని నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు చెప్పుకుంటున్నట్లు సమా చారం. ఈసారి అయినా మంచి పోస్టులు పొందాలని వారు ఇప్పటికే సిఫార్సులు చేస్తున్నారు. తాము సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తామని మంచి పేరు తీసుకువస్తామని ప్రజా ప్రతినిధులకు కొంత మంది హామీ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల కోడ్ ముగియడంతో నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధుల ఇళ్లకు ఇప్పటి వివిధ శాఖల అధికారులు వెళ్ళి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు చెప్తున్నారు. పనిలో పనిగా వారి మనసులో మాట చెప్పేసి హామీ పొందేస్తున్నారు. రాష్ట్రంలో కౌంటింగ్ ముగిసిన తరువాత కొన్ని ప్రాంతాల్లో ఇంకా అలజడులు, అల్లర్లు ఉంటున్న నేపథ్యంలో బదిలీలు కాస్త ఆలస్యం అవ్వవచ్చునని తెలుస్తోంది. అయితే ఈనెల 20 తరువాత పోలీస్ శాఖలో బదిలీలకు శ్రీకారం చుట్టి జులై మొదటి తేదీకి పూర్తి చేయ డానికి రంగం సిద్ధమైనట్లు సమాచారం. అంతేకాకుండా ఆగస్టు నాటికి పదో న్నతులు కూడా కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. డీఎస్పీ నుంచి ఎస్ఐ, సీఐలు ప్రస్తుతం తాము ఆశిస్తున్న ప్రాంతంలో పని చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు బదిలీలపై వచ్చిన అధికారులు తమ ప్రాంతానికి ఎప్పుడు వెళ్లిపోతామా అని వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు. మొత్తం మీద పదిరోజుల్లో బదిలీలకు తెర లేపుతారని తెలుస్తోంది.

క్రైం కార్నర్

బైక్‌లు ఢీ..ఇద్దరు యువకులు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

భీమవరం క్రైం, జూన్ 7 : రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. భీమవరం వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం పట్టణానికి చెందిన పెనుగొండ శ్రీను (37) డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. గురువారం రాత్రి శ్రీను, అతని స్నేహితుడు వీరవల్లి శ్రీనివాస్‌లు (30) ద్విచక్ర వాహనంపై భీమవరం నుంచి చినరంగని పాలెం వైపు వస్తుండగా విస్సాకోడేరు వైపు నుంచి భీమవరం వైపు యమహా వాహనంపై వస్తున్న వ్యక్తి వీరి వాహనాన్ని వేగంగా ఢీకొట్టాడు. దీంతో పెనుగొండ శ్రీను, వీరవల్లి శ్రీనివాస్‌ల తలకు తీవ్ర గాయాలవడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. అవతలి వ్యక్తి చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. పెనుగొండ శ్రీను భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాలకు భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు.

చెరువు గట్టు వివాదం..ఒకరిపై ఒకరు ఫిర్యాదు

ఆకివీడు, జూన్ 7: రొయ్యల చెరువు గట్టు తగాదాలో రైతు, అతని భార్య, కుమారుడిపై సమీప రైతుపై దాడి చేసిన ఘటనపై ఎస్ఐ బత్తిన నాగబాబు శుక్రవారం కేసు నమోదు చేశారు. సిద్దాపురం గ్రామంలో ఎరిచర్ల ఏసురత్నం కొన్నేళ్లుగా పోరంబోకు స్థలంలో రొయ్యల చెరువు సాగు చేస్తున్నాడు. గురువారం ఏసురత్నం చెరువు ఎత్తు పెంచుతుండగా మట్టిపడి మురుగుబోదె పూడుకుపోతున్నదని సమీప రైతు గొట్టుముక్కల సత్యనారాయణరాజు అటవీ శాఖాధికారికి ఫిర్యాదు చేశాడు. అధికారి శైలజ వచ్చి స్థలాన్ని పరిశీలించి గట్టు ఎత్తు చేసే పనులు నిలిపివేయాలని ఏసురత్నానికి చెప్పి వెళ్ళిపోయారు. దీంతో నాపైనే ఫిర్యాదు చేస్తావా అంటూ సత్యనారాయణరాజు, అతని భార్య, కొడుకులపై ఏసురత్నం ఇనుపరాడ్‌తో దాడి చేశారు. దీంతో సత్యనారాయణరాజుకు గాయాల వడంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేర ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తమపై సత్యనారాయణరాజు దాడి చేశారంటూ ఏసురత్నం, భార్య, కొడుకు ఆకివీడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో దాడి యత్నం.. ముగ్గురి అరెస్ట్

ఉండి, జూన్ 7: కత్తితో ఒక వ్యక్తిపై దాడికి యత్నించిన కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు ఉండి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.ఉండి మండలం ఎస్ఆర్‌పి అగ్రహారానికి చెందిన కిన్నెర వెంకన్నపై కత్తితో దాడి చేయడానికి యత్నించిన పామర్తి నాగరాజు, అతని స్నేహితులు నాగబాబు, సాయి రాంలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.వీరిని భీమవరం కోర్టుకు తరలించగా మేజిస్ట్రేట్ వారికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉడతపల్లిలో చిరుతపులి దాడి

ఐదు మేకలు మృత్యువాత



పోలవరం, జూన్ 7: చిరుత పులి దాడిలో ఐదు మేకలు మృత్యువాత పడిన సంఘటన ఏలూరు జిల్లా పోలవరం మండలం చేగొండపల్లి పంచాయతీ ఉడతపల్లిలో జరిగింది. అటవీక్షేత్రాధికారి ఎస్.దావీదురాజు తెలిపిన వివరాల ప్రకారం పాపికొండల అభయారణ్యం నేషనల్ పార్క్‌లోని ఉడతపల్లిలో రెండు రోజుల క్రితం చుంద్రు బుల్లబ్బాయ్ పశువుల పాకపై చిరుత దాడి చేసింది. ఐదు మేకలు మృత్యువాత పడడంతో సంఘటనా స్థలిని శుక్రవారం పరిశీలించామన్నారు. పాదముద్రల ద్వారా చిరుత దాడిగా ధ్రువీకరించి పశువుల యజమానికి పరిహారం అందించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిరుత సంచారం తెలుసుకోవడానికి ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మెత్తప్పకోట, ఉడతపల్లి గ్రామాల్లో పాడిపశువుల రైతులకు చిరుత సంచారంపై తమ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.

వాచ్‌మేన్‌పై దాడి

ఏలూరు క్రైం, జూన్ 7 : ఓ స్థలానికి సంబంధించిన వాచ్‌మేన్‌పై కొందరు దాడికి పాల్పడ్డారు. నగర శివారు ఆశ్రం ఆసుపత్రి సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న స్థలానికి సంబంధించిన వాచ్‌మేన్ కండాపు కనకారావు ఈనెల 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని జాతీయ రహదారి పక్కన అదే రోజు సాయంత్రం మొక్కలు నాటుతుండగా అక్కడ ఎందుకు మొక్కలు నాటుతున్నావంటూ పెరుగుగూడేనికి చెందిన నిర్మలరాజు మరికొందరు గొడవకు దిగారు. ఈ క్రమంలో వాచ్‌మేన్ కనకారావుపై వాళ్లు దాడి చేశారు. గాయాలపాలైన కనకారావును స్థానికులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

విద్యుదాఘాతానికి రెండు చూడి గేదెలు బలి

ముసునూరు, జూన్ 7: ముసునూరు మండలం లోపూడి గ్రామంలో విద్యుదాఘాతానికి రెండు చూడిగేదెలు మృతి చెందాయి. రైతులు పేరం గోపిరాజు, పేరం పుల్లయ్యలు శుక్రవారం తమ పశువులను పొలంలోకి మేతకు తోలుకువెళ్ళారు. బుధవారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి విద్యుత్ స్తతంభాలు విరిగి, తెగిపడిన తీగల్లో విద్యుత్ ప్రవహించడంతో అవి గేదెలకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కొక్క గేదె విలువ రూ. 60 వేలు ఉంటుందని రైతులు వాపోయారు. వీఆర్వో పి.నవీన్‌కుమార్ నివేదికను తహసీల్దార్ జవహర్ బాబికి సమాచారం అందించగా నివేదికను ఉన్నతాధికారులకు పంపి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని తహసీల్దార్ తెలిపారు.




శ్రీవారి శేషాచలంపై ఉన్న దేవస్థానం టోల్‌గేట్

ద్వారకా తిరుమల టోల్‌గేట్ వేలం ఏడాదికి రూ.1.37 కోట్లు

ద్వారకా తిరుమల, జూన్ 7: శ్రీవారి దేవస్థానం టోల్‌గేట్ నిర్వహణకు జరిగిన బహిరంగ వేలంపాటలో స్వామివారికి ఏడాదికి రూ. 1.37 కోట్లు ఆదాయం సమకూరింది. పాతకల్యాణ మండప ఆవరణలో శుక్రవారం టోల్ నిర్వహణ కోసం బహిరంగ వేలం జరిగింది. ఇందులో ఐదుగురు పాటదార్లు డిపాజిట్లు కట్టగా ఇద్దరే పోటీలో ఉన్నారు. అయితే వేలంలో పాల్గొన్న పాటదారులు రూ.1.32 కోట్లతో నిలిచిపోవడంతో టెండర్ బాక్స్‌ను దేవస్థానం ఓపెన్ చేసింది. అప్పగించిన నాటి నుంచి రెండేళ్ల కాలానికి గాను మొదటి ఏడాది రూ. కోటి 37 లక్షల 09 వేల 999 లకు నల్లజర్లకు చెందిన ఉప్పులూరి రేణుకాదేవి టెంటర్ వేసి హక్కును దక్కించుకున్నారు. రెండో ఏడాది దీనిమీద 10 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

ఐదు నెలలుగా దేవస్థానమే నిర్వహణ

మరో ఏడాది కాలం గడువు ఉండగానే టోల్‌గేట్ నిర్వహణ నిబంధనలను తుంగలోకి తొక్కి గీ కాంట్రాక్టర్ మొదటి ఏడాది నష్టం వచ్చిందని చెబుతూ ఈఏడాది జనవరి 31న మధ్యలోనే వదిలివేశాడు. రెండేళ్ల కాలానికి జరిగిన వేలంపాటలో కె.శ్రీనివాసరావు అనే కాంట్రాక్టర్ ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలకు రుసుము వసూలు చేసుకునే హక్కును ఏడాదికి రూ.1.70 కోట్లకు కైవసం చేసుకున్నాడు. నిబంధనల ప్రకారం రెండో ఏడు 10 శాతం మేర పెంచి, మొదటి ఏడాది పూర్తి కావడానికి మూడు నెలల ముందే రెండో ఏడుకు సంబంధించి నగదు మొత్తాన్ని దేవస్థానానికి చెల్లించాల్సి ఉంది. టోల్‌గేట్ నిర్వహణలో ఉన్న జీఎస్టీ కారణంగా నష్టబోతున్నానని ఇకపై నిర్వహణ సాధ్యం కాదని. తనిచ్చిన డిపాజిట్ సొమ్ము రూ.10 లక్షలు చెల్లించాలని దేవస్థానానికి అర్జీ పెట్టుకుని తప్పుకున్నాడు. దీంతో దేవస్థానమే ఫిబ్రవరి 1 నుంచి టోల్‌గేట్‌ను నిర్వహిస్తోంది. ఇప్పుడు తాజాగా వేలంపాట నిర్వహించడంతో టెండర్ ద్వారా హెచ్చు పాటదారునికి అవకాశం కల్పించనున్నారు.



శిక్షణా సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్

క్యాన్సర్ మరణాలు పెరిగిపోతున్నాయి

ఏలూరు క్రైం, జూన్ 7 : ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే ప్రకారం 2022లో భారతదేశంలో 14.1 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు, 9.1 లక్షల మంది క్యాన్సర్ కారణంగా మరణించారని ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో శుక్రవారం దంత వైద్యులు, గైనకాలజిస్టులు, వైద్యాధికారులతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెండు దశల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాన్సర్ ప్రస్తుతం దేశంలో 38 లక్షల మంది క్యాన్సర్‌తో జీవిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 75,536 కొత్త క్యాన్సర్ కేసులు, 40,307 మరణాలు నమోదయ్యాయి. భారతదేశంలో 75 ఏళ్ళలోపు క్యాన్సర్ వచ్చే ప్రమాదం 10.6 శాతమని అదే వయసులో క్యాన్సర్‌తో మరణించే ప్రమాదం 72 శాతం ఉందన్నారు. రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్‌లు భారతదేశంలోని మొత్తం క్యాన్సర్ కేసులలో 34 శాతం ఉన్నాయి. ముందస్తుగా గుర్తించడం ద్వారా వీటి నుంచి బయటపడవచ్చన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ఆధారంగా సరైన రిఫరల్ సిస్టమ్‌ను నిర్ధారిస్తూ, డేటాను పర్యవేక్షించడానికి, నిర్వహించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తుందన్నారు. ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తించడం వల్ల దానిని నియంత్రించడానికి వీలుపడుతుందాన్నరు. డాక్టర్ అనూష, డాక్టర్ గంగాభవానీ, డాక్టర్ ఉషాకిరణ్, డాక్టర్ అనూష, డాక్టర్ నజరీన్, డాక్టర్ లక్ష్మీ సరస్వతి, డాక్టర్ పి.కీర్తి ప్రియాంక, డాక్టర్ హేమంత్ పాల్గొన్నారు.

రేపు వీఆర్వోల రాష్ట్ర కమిటీ సమావేశం

ఏలూరు రూరల్, జూన్ 7: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్రకమిటీ అత్యవసర సమావేశం ఈనెల 9వ తేదీ ఆదివారం విజ యవాడ, గాంధీనగర్‌లో ఉన్న ప్రెస్‌క్లబ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహి స్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రకమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్ష కార్య దర్శులు తప్పనిసరిగా కమిటీ సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.